# ద్వంద్వం

జయశ్రీ

'జింటో నగర ప్రవేశం'లా అమీబా నాన్న శరీర ప్రవేశం చేసిందని అనుమానించి.మందు బాబాయి ((డాక్టరు) గారింటికెళ్ళి చీటీ వ్రాయించి ఆదివారం కావ దాన పరపతి ఉపయోగించి మందులకొట్టు వెనుక వుంటున్న కొట్టు వాళ్ళింటి కెళ్ళి కొట్టు తెరిపించి'ఫ్లాగిల్-200' ఓ పది కొని ఇంటికి తిరుగుముఖం పట్టాను. ఓ వంద గజాలు నడిచానో లేదో. పేవ్ మెంట్ మీద మట్టిలో ఏదో తెల్లగా మెరుస్తూ కనబడింది. చటుక్కున వంగాను.

పాంజేబు పట్టా. వెండిది. చేతిలోకి తీసుకున్నాను. నిటారుగా నిల్చున్నాను. మళ్ళీ పట్టావైపు. గుప్పిట తెరచి చూసి. మళ్ళీ మూసేశాను. 'ఏం అదృష్టం. ఎవరి ముఖం చూశానో! అన్నట్లు ఏ వారం? వ్చ శుక్రవారం అయితే బావుండేది. పోనీలే. వెండిది కదా. ఇవ్వాళ పౌర్ణమి. పౌర్ణమికి వెండికి మంచి జోడీ. అబ్బ! ఇదే బంగారమైతే....ఛీ ఛీ. ఇదేమిటి. నాకూ్కడా ఇటు వంటి పాడు ఆలోచనలు! పాపం ఇదసలు ఎవరిదో? ఎట్లా పడిపోయి వుంటుంది?'



మళ్ళీ చూశాను. శిల పైకి వచ్చేసింది. పట్టా కొత్తది. ఇంకా మెరుగైనా మాయలేదు. అప్పుడే పైకి వస్తున్న చంద్రుడి కాంతిని చూసి మిలమిలా మెత్తగా మెరుస్తూంది. ఎంత బావుందో.

అటూ యిటూ చూశాను. మగవాళ్ళేకాని ఆడవాళ్ళెవరూ కనబడలేదు. వెదుక్కుంటున్నట్టు వస్తున్న వాళ్ళసలే లేరు. మనసులో ఇది లేనివాళ్ళదని ఎందుకనుకోవాలి. కలవారి బిడ్డ దగ్గర్లో సినిమాకని వెళ్ళవస్తోందే....మో. ఎంత వుంటుంది? మహా అయితే ఓ 60రూపాయలు. అరవయ్యేగా.పర్వాలా. ఇంకో ఇంత వేస్తే వెండికంటె. బోలుచేత చేస్తానన్నాడు మా గోల్డ్‌స్మిత్. రేపే అద గాలి. ఇల్లు దగ్గర పడుతోంది. నాన్న-అమ్మో నాన్న. చిన్నప్పుడు పెన్ను దొరికిందంటే వెనక్కి. తిప్పి పంపించి ఎక్కడ దొరికిందో అక్కడే పెట్టి రమ్మని పంపించిన నాన్న గుర్తొచ్చారు "మనం కాకపోతే మన వెనక వచ్చినవాళ్ళు తీసుకుపోరా" అంటే "అయినాసరే,దొరికిన సొమ్ము మన కొద్దు- అయినా నీకిప్పుడు పెన్ను అవసరమయితే వెళ్ళి కొనుక్కో" అనేవారు. ఇప్పుడూ అలాగే అంటే-ఛీఛీ. ఇందాకే మంచితనం. నాన్న పెంపకం నిలిచి చూడమంటోంది. దీన్ని ఆశ "ఆలస్యం అయిపోతుంద"నేసాకుతో జోకొట్టేసింది. నడవటం మొదలెట్టాను. మళ్ళీ.

'ఈ పట్టా. ఎవరైనా చిన్నపిల్లలదేమో! అయిన దానికి. కానిదానికి పిల్లల వీపుల మీద చరుపులు వాయించే పెద్దవాళ్ళయితే ఈ పాటికి వాళ్ళవీపులు చిట్లుతూ ఉండాలి. పట్టెడన్నం పెట్టలేకపోయినా పాప కాళ్ళకు పట్టాలు చూడాలనుకుంటున్న పేదవాడి కూతురి పట్టా అయితే?' గుండె మెలిపడినట్లయింది. పట్టా తీసి మళ్ళీ చూశాను. 'హమ్మయ్య. కాదు ఎవరిదో పెద్దవాళ్ళదే. పోన్లే ఇంకొకటి కొనుక్కుంటారు. అయినా అక్కడ పెట్టి రావాల్సింది. ఇప్పుడు పెట్టరమంటే. ఇంతసేపు దీనితో అనుబంధం పెంచుకుని ఉహూ! మనపొవ్వటం లేదు. చెప్పొద్దు- అసలు చెప్పొద్దు....'

ఇల్లు చేరుకుని.నాన్నకు మందులిచ్చాను. ఓ ఐదు నిమిషాల తర్వాత అమ్మ వచ్చింది. చూపించాను. పని ఉన్నట్లుంది. చూసీ చూడనట్లు చూసి మళ్ళీ నాన్న గదిలోకి వెళ్తోంది. "నాన్నతో చెప్పొద్దు"అని గుసగుసగా చెప్పాను. "చెప్పొద్దా" అని మళ్ళీ గట్టిగా క్లారిఫికేషన్ కోసం అడిగింది.నాన్న విన్నారు. ఏమిటని అడిగారు. చెప్పక తప్పింది కాదు.

పాఠం చెప్పారు. ఈసారి ఏం చెయ్యాలో నాకు చెప్పలేదు. కొంచెం పెద్దదాన్నయ్యాననేమో! నాకే అన్పించింది. నాన్నకు చెప్పకుండా అమ్మకు మాత్రమే చెప్పి మళ్ళీ రోడ్డుమీదకు వచ్చాను. ఎక్కడ తీశానో. అక్కడే పడవేశాను. ఏమవుతుందో చూద్దామనే కుతూహలం పోలేదు. అక్కడకు పది గజాల దూరంలో వున్న బస్‌స్టాప్‌లో నిల్చుని చూస్తూ వున్నాను. జనసంచారం అట్టే లేదు. పది నిమిషాలు గడిచాయి. ఆకాశంలోకి చూస్తూ నల్గురు దిక్కులు చూస్తూ ఇంకో నల్గురు. అఘోవదనులై మరిఇద్దరు ఆ దారిన వెళ్ళారు. రోజూ ఒక మనిషినుంచి అయిదు పైసల కంటె ఎక్కువ తీసుకోని ప్రిన్సిపల్డ్ బిచ్చగాడు దాన్నితీసి చూసి మళ్ళీ అక్కడే వదేసి సాగిపోయాడు. లోలోపల సంతోషం రేకులు విచ్చుకోబోయింది. ఓ ప్రీమియర్ పద్మిని మెత్తగా ఆగింది. పీల్లోంచి కష్టపడి మొత్తంమీద ఎట్లా అయితేనేం ఒకాయనదిగి బడ్డీకొట్లో సిగరెట్ ప్యాకెట్ కొని. ఒకటితీసి మళ్ళీ అగ్గిపుల్ల ఖర్చెందుకని అక్కడే వెలిగించుకుని వచ్చేస్తూ వంగి దాన్ని జేబులో వేసుకుని. ఈ సారి మహా ఒడుపుగా సీట్లోచేరి. తుర్రుమన్నాడు.

కుతూహలం నీరుకారిపోయి ఇంటిముఖం పట్టాను. అమ్మ లక్ష్మి లక్ష్మి వున్నచోటనే చేరుతుందనే సామెత చెప్పింది.

అప్పుడు నాలో ఏదో. గుండెలో ఓ రెండు అరలు భారంగా ఇంకోరెండు తేలిగ్గా రెండూ కలిపి మెదడుకు జడత్వం ప్రసాదించాయి.